క్లుప్తంగా

వైభవంగా 54 కలశాల పూజ



మొగలికుదురులో కలశ పూజలో పాల్గొన్న స్వాములు

మామిడికుదురు: మొగలికుదురు జున్నూరినగర్‌లో అయ్యప్పస్వామి 54 కలశాల పూజ సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. రుద్రా శ్రీనివాసరావు స్వగృహం వద్ద జరిగిన కలశాల పూజలో భారీ సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. మేళతాళాలు, బాణసంచా కాల్పులతో స్వాములు నృత్యాలు చేస్తూ కలశాలతో కాలువ వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడి నుంచి కలశాలతో జలాలు తీసుకువచ్చి పూజ నిర్వహించారు. తాటిపాకకు చెందిన పాటబళ్ల కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది. బ్రహ్మశ్రీ కారుపర్తి కోటేశ్వరరావు వినాయకునికి, సుబ్రహ్మణ్య స్వామికి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సహస్రనామాలతో అర్చన చేశారు. వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో స్వాములు ఈ పూజకి హాజరయ్యారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొత్తపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీ, మండల ప్రజా పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు లొల్లలో గడప గడపకూ..

ఆత్రేయపురం: మండలంలోని లొల్ల గ్రామంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని గ్రామంలో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ నాయకులు, అభిమానులు తరలి రావాలని ఆయన కోరారు.

నేడు పాఠశాలలకు వంట పాత్రల పంపిణీ

కొత్తపేట: మండలంలోని 82 ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేసిందని ఎంఈఓ ఎం.హరిప్రసాద్ తెలిపారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఏ నుంచి ఎఫ్ వరకూ 6 రకాల కిట్లు వచ్చినట్టు తెలిపారు. ఏ రకం కిట్ రూ.6,430 కాగా 50 కిట్స్, బీ-రకం కిట్ రూ.6,430 కాగా 11 కిట్స్, సీ-కిట్ రూ.11,285 కాగా 13 కిట్స్, డీ-కిట్ రూ.14,252 కాగా ఒకటి, ఈ రకం కిట్ రూ.15,231 కాగా 2, ఎఫ్ కిట్ రూ.16,296 కాగా 5 కిట్లు వచ్చాయన్నారు. మొత్తం రూ.7,44,946 విలువైన 82 కిట్స్ వచ్చాయన్నారు. ఈ వంట పాత్రలను బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ జరుగుతుందని ఎంఈఓ హరిప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, మండల ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. గ్రామాల వారీగా గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు తదితర భవనాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శిగా 'లంకే'

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శిగా పల్లిపాలేనికి చెందిన మాజీ ఉపసర్పంచ్ లంకే సుబ్బారావును నియమించారు. మంగళవారం ఈ మేరకు కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన ఆయా మండలాల పార్టీ కార్యవర్గాలను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అభినందించారు. పలువురు సుబ్బారావుకు శుభాకాంక్షలు చెప్పారు.

వైభవంగా ధర్మపథం కుంకుమ పూజలు

ఆలమూరు: రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాల మేరకు మండలంలోని సంధిపూడిలో మంగళవారం కుంకుమ పూజలు వైభవంగా జరిగాయి. చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ పర్యవేక్షణలో గ్రామదేవత రావులమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో వేద పండితులు పి.నరసింహమూర్తి మంత్రోచ్చారణల మధ్య ఈ పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించి భక్తి పారవశ్యం చెందారు. దేవదాయశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ ధర్మపథం కార్యక్రమాన్ని పురస్కరించుకుని భక్తులకు పూజా సామగ్రిని ఈవో ఉండవిల్లి వీర్రాజు సమకూర్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్, పురోహితుడు పి.రాంబాబు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకు రైతు నేస్తం



అంబాజీపేటలో రైతు నేస్తం చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు నేస్తం పథకం ద్వారా రైతన్నలు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట సొసైటీ కార్యాలయంలో రైతు నేస్తం పథకం ద్వారా మంజూరైన సొసైటీకి చెందిన ఐదుగురు రైతులకు రూ.55 లక్షల చెక్కులను సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సంఘ సభ్యులకు ఎకరాకు రూ.8 లక్షల రుణాన్ని 12 శాతం వడ్డీతో పదేళ్ల కాల పరిమితికి డీసీసీబీ ద్వారా అందిస్తున్నామన్నారు. గరిష్టంగా రూ.20 లక్షల వరకూ రుణం పొందవచ్చన్నారు. సొసైటీల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేస్తున్నామన్నారు. ఆర్బీకేలకు సపోర్టింగ్ ఏజెన్సీగా ఉంటూ రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, డైరెక్టర్లు నందెపు సూరిబాబు, గోసంగి గంగిశెట్టి, మైలా ఆనందరావు, ఉందుర్తి నాగబాబు, మట్టపర్తి బాలజీ, సీతఊట కుంపట్ల అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొత్తపేటలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: ఏ పార్టీ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలు అమలులో తమ పార్టీ వారికే ప్రాధాన్యం ఇస్తుందని, కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పార్టీ రహితంగా అర్హులందరికీ లబ్ధి చేకూర్చిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక మద్దులమెరక, చిన, పెదరాముడినూతిమెరక గ్రామాలు, కమ్మిరెడ్డిపాలెం అంబేడ్కర్‌నగర్, గౌతమినగర్ ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా వివిధ పథకాలు పొందిన లబ్ధిదారులు జగ్గిరెడ్డికి సాదరంగా స్వాగతం పలికారు. ప్రతి ఇంటా, ప్రతి కుటుంబాన్ని ముఖ్యంగా మహిళలు, వృద్ధులను ఆయన ఆప్యాయంగా పలకరించారు. ఆయా కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తూ వాటిని వివరించారు. ఇవన్నీ అందాయా? వలంటీర్ వస్తున్నారా? అని ప్రశ్నించారు. దానికి ప్రతిగా వారు అన్నీ అందాయని, వలంటీర్ సేవలు బాగున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సీఎం జగన్ ఈ సంక్షేమ పథకాలు రూపొందించారన్నారు. ఈ విధంగా ఏపీలో సీఎం జగన్ పరిపాలన దేశానికే స్ఫూర్తిగా నిలిచిందన్నారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును జగ్గిరెడ్డి ప్రారంభించారు. శివారు గ్రామాల్లో ఎక్కడికక్కడ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆయా గ్రామాల పెద్దలు పూలమాలలు, శాలులతో సత్కరించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ డీఎస్, ఎంపీటీసీలు చావలి సుబ్బరాయశాస్త్రి, రేవాడి నాగమణి, పేపకాయల బ్రహ్మానందం, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి ప్రాధాన్యం



మోరి చేనేత సొసైటీలో కార్మికులకు చేనేత పరికరాలు ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: చేనేత కార్మికుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం మోరి చేనేత సొసైటీలో న్యూఢిల్లీకి చెందిన డెవలప్‌మెంట్ కమిషనర్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్, మోరి బ్లాక్ లెవెల్ క్లస్టర్‌లోని 129 మంది లబ్ధిదారులకు సమకూర్చిన రూ.8 లక్షల 82 వేల 700 విలువ చేసే చేనేత వృత్తి పరికరాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా నేతన్నలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నారన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ పి.లక్ష్మీ పద్మ మంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జాన శంకరరావు, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి పెద్దిరాజు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు రాజు, చింతయ్య, కార్యదర్శి ప్రసాద్, పలువురు చేనేత నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పెదపళ్ల ఆర్బీకేలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలోని ఆర్బీకేలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ యేడిద సత్యశ్రీ, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి త్వరితగతిన చెల్లింపులు చేస్తామని పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి హామీ ఇచ్చారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆర్బీకే వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొడితి వెంకన్న, మేడపాటి లక్ష్మణరావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేను సద్వినియోగం చేసుకోండి



భూ సర్వే అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజ్యలక్ష్మి

మలికిపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సమగ్ర భూ సర్వేను ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మలికిపురం పంచాయతీ వద్ద జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆధునిక డ్రోన్ సహకారంతో అత్యంత సాంకేతికంగా ప్రజల భూములను సర్వే చేసి వాటికి చట్ట పరమైన డాక్యుమెంట్లతో పూర్తి భద్రత ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నా ఈ సర్వేలో తొలగిపోతాయని అన్నారు. దీనిపై ఎటువంటి అపోహలకు తావులేదన్నారు. పంచాయతీ కార్యదర్శి బొంతు శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీఆర్వోలు హరికిషన్, అచ్యుత్, ఉపసర్పంచ్ గుబ్బల బాబ్జి, నాయకులు గెడ్డం తులసీ భాస్కరరావు, గెడ్డం ఫిలిప్‌రాజు, తాడి వర్మ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడికి సన్మానం



ఎల్.గన్నవరంలో సొసైటీ చైర్మన్ ఆనంద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: ఇటీవల ఢిల్లీలో జరిగిన సదస్సులో పాల్గొని హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ఎన్‌సీఈఎల్ భాగస్వామ్య పత్రాలు అందుకున్న పి.గన్నవరం సొసైటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్‌కు మంగళవారం ఎల్.గన్నవరంలో అభినందన సభ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మానుకొండ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు, స్థానిక నాయకులు కలిసి ఆనంద్‌ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. సొసైటీ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు.

మరోసారి జగనే సీఎం

మలికిపురం: వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి మరోసారి జగనే సీఎం కాబోతున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. మలికిపురం మండలం కత్తిమండలోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయం వద్ద నూతనంగా ఎన్నికైన మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండల కమిటీలను ఎమ్మెల్యే అభినందించారు. ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మండల కమిటీలు నిరంతరం కష్టపడి పనిచేసి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌ని మరోసారి ముఖ్యమంత్రి చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ గ్రీవెన్స్ సెల్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, అడబాల వీరబ్రహ్మజీరావు, బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా సీఎం జగన్



ఎమ్మెల్యే రాపాక సమక్షంలో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన విలేకరులు

మలికిపురం: జర్నలిస్టులకు అండగా సీఎం జగన్ ఉంటారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. నియోజక వర్గంలోని ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు మంగళవారం కతిమండ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాపాకను కలిశారు. విలేకరులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీఎం జగన్ నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ జర్నలిస్టులకు అండగా నిలిచారని ఆయన అన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిన సందర్భంగా పలువురు రాజోలు నియోజకవర్గానికి చెందిన విలేకరులు ఎమ్మెల్యే సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

భారీ అన్నసమారాధన

ఆలమూరు: శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని మండలంలోని చొప్పెల్లలో మంగళవారం అన్నసమారాధన జరిగింది. స్థానిక కనకమహాలక్ష్మి సెంటర్‌లో నెలకొల్పిన దుర్గాదేవి మండప ఆవరణలో గ్రామస్తుల సహకారంతో పిండివంటలతో నిర్వాహకులు ఈ అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు ఆరు వేల మంది భక్తులు వచ్చి అన్నదానాన్ని స్వీకరించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అన్నసమారాధనను విజయవంతం చేసిన ఆలయ కమిటీని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ తదితరులు అభినందించారు.

ప్రతిపక్షాల కుయుక్తులను తిప్పికొట్టండి



కొత్తపేటలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిసి మద్దతు తెలుపుతున్న ర్యాలి కార్యకర్తలు

కొత్తపేట: వైఎస్సార్ సీపీ కార్యకర్తలను బలవంతంగా తమ వైపు తిప్పుకోవాలనే ప్రతిపక్షాల కుయుక్తులను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నరుకుల సత్యనారాయణ, నరుకుల శివ మంగళవారం ఆ మండల జెడ్పీటీసీ బోనం సాయిబాబా ఆధ్వర్యంలో కొత్తపేటలో గడప గడపకూ కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిశారు. వారు మాట్లాడుతూ తాము ఎప్పుడూ మీ నాయకత్వంలో పనిచేసే వైఎస్సార్ సీపీ కార్యకర్తలమేనని, అయితే జనసేన నాయకులు మా గ్రామం వచ్చి టీడీపీ కార్యకర్తలతో పాటు ఆ పక్కనే ఉన్న తమకు బలవంతంగా ఆ పార్టీ కండువాలు వేశారని వివరించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పార్టీ రహితంగా, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేసి సంక్షేమ పథకాల అమలు చేస్తుందన్నారు. దీనిని చూసి తట్టుకోలేని ప్రతిపక్షాలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు బలవంతంగా వారి కండువాలు వేసే సంస్కృతికి తెరలేపారని విమర్శించారు. వారెన్ని ప్రయత్నాలు చేసినా ప్రజా మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందన్నారు.

గొందిలో ఘనంగా ధర్మ ప్రచార వారోత్సవం

సఖినేటిపల్లి: ఏపీ దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానం పర్యవేక్షణలో మంగళవారం గొంది ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ధర్మ ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద దేవస్థానం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు నాగ సీతారాం లక్ష్మీనృసింహునికి అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. తొలుత గ్రామ పొలిమేర నుంచి మంగళవాయిద్యాలతో స్వామితో నగర సంకీర్తన చేస్తూ అమ్మవారి ఆలయం వరకూ శోభా యాత్ర చేశారు. శోభాయాత్రలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. యాత్రలో దారిపొడవునా స్వామికి గ్రామస్తులు మంగళ హారతులు పట్టారు. అనంతరం ఆలయం వద్ద స్వామికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సర్పంచ్ దొండపాటి రవికుమార్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి



బస్సు యాత్రను విజయవంతం చేయాలని నినదిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: పి.గన్నవరం నియోజకవర్గంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రను ఎస్సీ, బీసీ, ఎస్టీ నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని సిరిపల్లిలోని సిరిపల్లమ్మ ఆలయం వద్ద వైఎస్సార్ సీపీకి చెందిన ఎస్సీ నాయకులతో నియోజకవర్గ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొంతు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సుయాత్రకు మండలంలోని ఎస్సీలు సన్నద్ధం కావాలని అన్నారు. ఈ యాత్రలో భాగంగా ఎస్సీలు, బీసీలు, ఎస్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేకూరిన లబ్ధిని వివరిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, యడ్ల కిరణ్‌బాబు, గుమ్మడి ప్రసాద్, వార జయసావిత్రి, పెట్టా జగన్, పులిదిండి ప్రభాకర్, కొరపు రవి, నామాడి టైటాస్, కాశి సత్యనారాయణ సుమారు 500 మంది ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయాలి

పి.గన్నవరం: ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు జరుగుతాయని వెల్లడించారు. కొత్త ఓట్ల నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపులు, మార్పులు వంటి అంశాలపై బీఎల్‌ఓలకు దరఖాస్తులు అందించాలని ఠాగూర్ సూచించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు తోలేటి సత్తిబాబు, చెరుకూరి గోపాలకృష్ణ, కుసుమ వెంకటేశ్వరరావు, చీకరమెల్లి శ్రీనివాస్, తాటికాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

16న ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికలు

పి.గన్నవరం: రాజీనామాలతో ఖాళీ అయిన పి.గన్నవరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈనెల 16వ తేదీ ఉదయం 11 ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన మెజార్టీ ఎంపీటీసీలు గెలవడంతో.. రెండేళ్ల పాటు టీడీపీ, మూడేళ్ల పాటు ఎంపీపీ పదవులను నిర్వహించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండేళ్ల పాటు టీడీపీ పాలన పూర్తి కావడంతో టీడీపీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఇద్దరు వైస్ ఎంపీపీలు రాజీనామా చేసిన విషయం విదితమే. దీంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలి

సఖినేటిపల్లి: మొక్కల పెంపకానికి ప్రతి ఒక్కరూ తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సఖినేటిపల్లిలంకకు చెందిన ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాజోలు క్లస్టర్ కో ఆర్డినేటర్, తెలుగు టీచర్ గుండేపల్లి ప్రభావతి అన్నారు. మంగళవారం సఖినేటిపల్లి గీతామందిరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభావతి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. బాదం, దానిమ్మ, బొప్పాయి, వేప, జామ మొక్కలను ఆమె విద్యార్థులతో కలసి నాటారు. అనంతరం పాఠశాల తరగతి గదిలో విద్యార్థులకు పర్యావరణపై అవగాహన కల్పించారు. ఆక్సిజన్ ఇచ్చే మొక్కలను ఇళ్ల వద్ద కూడా పెంచుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం కె.వీరాస్వామి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

నా మట్టి-నా దేశం విజయవంతంపై హర్షం

రాజోలు: బీజేపీ చేపట్టిన నా మట్టి-నా దేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రాజోలులో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నా మట్టి-నా దేశం కార్యక్రమంలో ఢిల్లీ వెళ్లిన పార్టీ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, చెల్లింగి త్రినాథరావు, శ్రీనివాస్, చెంపాటి శివరామకృష్ణమరాజు, జేఎన్ఎస్ గోపాలకృష్ణ, కాపిశెట్టి కనికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించండి

అంబాజీపేట: మాచవరం మేజర్ పంచాయతీలో గత కొన్ని నెలలుగా పరిష్కారం కాని చెత్త డంపింగ్ సమస్యను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ స్పెషల్ కమిషనర్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు లేఖ రాశారు. ప్రభాకరరావు మాట్లాడుతూ మాచవరం పంచాయతీ పరిధిలో చెత్త డంపింగ్ చేసేందుకు స్థానికులు అడ్డుకుంటున్నారన్నారు. మాచవరంలో సంపద కేంద్రం ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో చెత్తను వేసేందుకు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై అఖిలపక్ష నాయకులు జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేదని వివరించారు. గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో ప్రజలు విషజ్వరాలు, డెంగీ, మలేరియా జ్వరాల పడుతున్నారని ఆ లేఖలో వివరించారు. తక్షణం చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెకుముకి సైన్స్ సంబరాల బ్రోచర్ విడుదల

ఆత్రేయపురం: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయిలో నవంబర్ 10న ప్రారంభమై, మండల స్థాయిలో ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బ్రోచర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ పర్యవేక్షకులు టీవీ సురేంద్ర రెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

రాజోలు: వేగివారిపాలెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు సాయంగా అందజేశారు. గ్రామానికి చెందిన చుట్టుగుళ్ల లక్ష్మణరావు గత కొంతకాలంగా అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఆయన కుటుంబానికి రూ.5 వేలు విలువైన నిత్యావసరాలు, 26 కేజీల బియ్యం బస్తా అందజేశారు. దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల మురళీకృష్ణ, బొడ్డపల్లి పుల్లయ్య, పాముల హర్షవర్ధనరావు, చుట్టుగుళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

రావులపాలెం: పవిత్ర కార్తికమాసం సందర్భంగా పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటలోని శైవ క్షేత్రాలను ఒకే రోజులో కార్తిక సోమవారం నాడు దర్శించుకునే విధంగా భక్తుల సౌకర్యార్థం స్థానిక డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ మంగళవారం తెలిపారు. పంచారామాల బస్సులు కార్తికమాసంలో ఆదివారం, అనగా నవంబర్ 19, 26, డిసెంబర్ 3,10 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలు దేరి కార్తిక సోమవారం అన్ని శైవక్షేత్రాలు దర్శనం అనంతరం రావులపాలెం చేరుకుంటాయన్నారు. టికెట్ ధర సూపర్ లగ్జరీ రూ.1170, అల్ట్రా డీలక్స్ రూ.1125, ఎక్స్‌ప్రెస్ రూ.915 లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ బస్సులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ సెల్: 7382911871, బస్ స్టేషన్ ఎంక్వయిరీ 9959225549, 7382912398, 7382912400 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల పెంపునకు కృషి చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా గ్రామాల పీహెచ్‌సీల్లో మంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. ఆగస్టు నెలలో సాధించినవలసిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన కటారి రాజ్‌కుమార్‌ను హత్యాయత్నం కేసులో అరెస్టు చేసి కొత్తపేట కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 2న అదే గ్రామానికి చెందిన దిడ్ల సురేష్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో రాజ్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి కొత్తపేట కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.